ప్రజాశక్తి
మంగళవారం 21 మే 2024 5 అనంతపురం



పిడుగుపాటుకు కూలీ మృతి



మృతుడు చంద్రశేఖర్

ప్రజాశక్తి బత్తలపల్లి

పొలం వద్దకు వెళ్లిన కూలీ ఇంటికి వెళ్లే క్రమంలో పిడుగుపాటుకు గురై మృతి చెందిన సంఘటన మండలంలోని ఉప్పర్లపల్లి గ్రామ సమీపాన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకు మండలంలోని దంపెట్ల గ్రామానికి చెందిన జింకా చంద్రశేఖర్(55) ఉప్పర్లపల్లి-గరికలపల్లి గ్రామాల సమీపాన గల సుధీర్ అనే రైతు పొలంలో కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం పొలంవద్ద ఉండగా వర్షం ప్రారంభం కావడంతో ఇంటికి వెళ్లేందుకు బయలుదేరాడు. ఇంతలో ఉరుములు, మెరుపులుతో కూడిన వర్షం అధికం కావడంతో సమీపాన కోళ్లఫారం వద్ద ఉన్న రైతుల వద్దకు చేరుకునేందుకు అక్కడికి వెళ్లే క్రమంలో పిడుగు పడినట్లు పెద్ద శబ్దం వచ్చింది.దీంతో చంద్రశేఖర్ షాక్‌కు గురయ్యాడు. దీంతో సమీపాన ఉన్న రైతులు చంద్రశేఖర్ వద్దకు వచ్చి నీరు తాగించే ప్రయత్నం చేశారు. అప్పటికే చంద్రశేఖర్ మృతిచెంది ఉన్నాడు. మృతునికి భార్య ప్రమీలమ్మతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన చంద్రశేఖర్ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తాడిపత్రిలో హైటెన్షన్...

పోలీసుల మాక్‌డ్రిల్, ఫ్లాగ్‌మార్చ్
అదనపు బలగాల కవాతు
అజ్ఞాతంలోకి మండల నాయకులు





పట్టణంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - అనంతపురం

తాడిపత్రిలో సోమవారం హైటెన్షన్ నెలకొంది. పోలీసులు, ప్రత్యేక బలగాలతో పట్టణం నిండిపోయింది. తెల్లవారుజాము నుంచి మాక్‌డ్రిల్, ఫ్లాగ్‌మార్చ్, కవాతు నిర్వహించారు. పట్టణంలో పోలీసు బలగాలు 24/7 అప్రమత్తంగా ఉంటున్నాయి. అనంతపురం రేంజ్ డిఐజి డాక్టర్ షిమోషి,జిల్లా ఎస్పీ గౌతమిశాలి ఆదేశాలతో తాడిపత్రిలో సోమవారం మాక్ డ్రిల్, ఫ్లాగ్ మార్చ్‌నిర్వహించారు. తాడిపత్రిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టేందుకు పికెట్లు, మొబైల్ పార్టీల గస్తీలు, వెహికల్ చెకింగ్ ముమ్మరం చేశారు. స్థానిక పోలీసులతో పాటు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, ఎపిఎస్‌పి, ఎఆర్ బలగాలను మోహరింపజేశారు. తాడిపత్రిలోని పలు ప్రదేశాలు, సమస్యాత్మక ప్రాంతాలు, కూడళ్లలో పోలీసు పికెట్లు, మొబైల్ పార్టీల గస్తీలు, వెహికల్ చెకింగ్‌లు నిర్వహించారు. ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే ఏమేరకు అప్రమత్తంగా ఉంటూ నిర్దేశిత రెస్పాన్స్ టైంలో ఘటనా స్థలానికి వెళ్లి చర్యలు తీసుకోగలుగుతారో చెక్ చేయడానికి పోలీసు అధికారులు సోమవారం తాడిపత్రిలో మాక్ డ్రిల్ నిర్వహించారు. తెల్లవారుజామున 3 గంటలకు అలర్ట్‌నెస్ చెక్ చేయగా ఆయా విధుల్లో ఉన్న అన్ని విభాగాల సిబ్బంది అప్రమత్తంగా ఉన్నట్లు తేలింది. అందరూ సకాలంలో చేరుకుని ఏ ఘటన జరిగినా వెంటనే సద్దుమణిచేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడైంది. అదనపు ఎస్పీలు ఆర్ విజయభాస్కర్ రెడ్డి, జి.రామకష్ణ, డీఎస్పీలు బి.శ్రీనివాసులు, జి.శివభాస్కర్ రెడ్డి, బివి శివారెడ్డి, యు.నరసింగప్ప, శ్రావణ్ కుమార్ నేతృత్వంలో కేంద్రసాయుధ బలగాలు, ఏపీఎస్పీ, ఏ.ఆర్ సాయుధ పోలీసు బలగాలచే ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పట్టణంలో అశోక్ పిల్లర్ నుండి ప్రారంభమై క్రిటికల్ ప్రాంతాలైన బండామసీద్, చిన్న బజార్, కటికవీధి, సుంకులమ్మపాలెం, యల్లనూరు రోడ్డు సర్కిల్, పుట్లూరు రోడ్డు సర్కిల్ ల మీదుగా అర్బన్ పోలీసు స్టేషన్ వరకు ఈ కవాతు కొనసాగింది.

తాడిపత్రిలో అత్యధిక కేసులు

సిట్ నివేదికల్లో వెల్లడి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికల అనంతరం జరిగిన అల్లర్లు అత్యధికం తాడిపత్రిలోనే ఉండటం గమనార్హం. ఈ మేరకు సిట్ ఇచ్చిన నివేదికలోని అంశాలను పరిశీలిస్తే స్పష్టమవుతోంది. మే 13వ తేదీన పోలింగు రోజు రాష్ట్రంలో పలుచోట్ల పెద్దఎత్తున అల్లర్లు చోటు చేసుకున్నాయి. ఇందులో అనంతపురం జిల్లాలోని తాడిపత్రిలో వైసిపి, టిడిపి గ్రూపుల మధ్య అల్లర్ల పెద్దఎత్తున చోటు చేసుకున్నాయి. ఓటింగు రోజు ఉదయం స్వల్పంగా ప్రారంభమైన ఘర్షణ రానురాను తీవ్ర రూపం దాల్చింది. మూడు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా ఘర్షణ చోటు చేసుకుంది. దీనిపై ఎన్నికల సంఘం సీరియస్ అయింది. ఇప్పటికే జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్‌ను, డిఎస్పీ గంగయ్యను సస్పెండ్ చేసింది. ఆపైన ప్రత్యేక విచారణ బృందాన్ని నియమించింది. విచారణబృందం రెండు రోజుల పాటు తాడిపత్రిలో మకాం వేసి పూర్తి స్థాయి విచారణ చేపట్టింది. అటు అధికారులతోపాటు, క్షేత్ర స్థాయిలో బాధితులను విచారించింది. విచారించి జరిగిన పరిణామాలపై నివేదికను డిజిపికి అందజేసింది. ఆ నివేదికలో పేర్కొన్న ప్రకారం చూస్తే అత్యధిక మందిపై కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలోనే అత్యధికమందిపై కేసులు ఇక్కడ ఉండటం గమనార్హం. రాష్ట్ర వ్యాప్తంగా 33 కేసులు నమోదయితే తాడిపత్రిలోని ఒక పోలీస్ స్టేషన్ పరిధిలోనే ఏడు కేసులు నమోదయ్యాయి. ఇందులో 728 మందిపై కేసులు నమోదు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 1320 మందిపై కేసు నమోదు అయింది. ఇక్కడ ఒక్కటే 728 మందిపై కేసు నమోదయింది. ఇందులో ఇప్పటికి 396 మందిని గుర్తించారు. ఇంకా 332 మందిని గుర్తించాల్సి ఉంది. గుర్తించిన వారిలో 91 మందిని అరెస్టు చేశారు. ఇంకా 634 మందిని అరెస్టు చేయాల్సుంది. కేసులు నమోదయిన వారిలో అటు వైసిని, ఇటు టిడిపి నుంచి ఇద్దరు ముఖ్య నేతలున్నట్టు తెలుస్తోంది. వైసిపి నుంచి తాజా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, ఆయనకుమారుడు హర్షవర్ధన్‌రెడ్డిలపైనా కేసు నమోదయింది. అదే విధంగా టిడిపి నుంచి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి, ఆయన తనయుడు జెసి.అస్మిత్‌రెడ్డిలపైనా కేసులు నమోదయినట్టు తెలుస్తోంది. ప్రాథమికంగా వచ్చిన సమాచారం మేరకు మరింత లోతుగా దర్యాప్తు జరగాల్సి ఉందని సిట్‌బృందం నివేదికలో పేర్కొంది. ఈ నివేదిక సమయంలోనూ మరిన్ని పేర్లు చేరుతాయా లేక ఇంతటితోనే కేసుల నమోదు పూర్తవుతుందా చూడాల్సి ఉంది.

తాడిపత్రి డీఎస్పీగా జనార్థన్ నాయుడు

తాడిపత్రి డీఎస్పీగా జనార్థన్ నాయుడు నియమితులయ్యారు. ఏలూరు సెబ్ అధికారిగా ఉన్న ఈయనను తాడిపత్రి డీఎస్పీగా నియమించారు. ముందున్న డీఎస్పీ గంగయ్య ఇటీవల సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో జనార్థన్‌నాయుడు నియమితులయ్యారు. ఇక సిఐ మురళీకృష్ణ స్థానంలో నాగేంద్ర ప్రసాద్‌ను నియమించారు. ఈయన ఇది వరకు విఆర్‌లో ఉండే వారు.

జేసీ ప్రభాకర్‌రెడ్డి సోమవారం తాడిపత్రికి వస్తున్నారన్న పుకారు షికారు చేసింది. అయితే ఆయన హైదరాబాదులోనే ఉన్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా తాడిపత్రి ఘటనపై విచారణకు తాడిపత్రికి వచ్చిన సిట్ అధికారులు అన్ని కోణాల్లోనూ విచారణ చేసి సోమవారం ఉదయం వెళ్లిపోయారు. ఈకార్యక్రమంలో సిఐలు క్రాంతికుమార్, ధరణీకిశోర్, శివరాముడు, జనార్ధన్, వెంకటేష్ నాయక్, పలువురు ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.



తాడిపత్రిలో కేంద్ర బలగాలు

అజ్ఞాతంలోకి పుట్లూరు, యల్లనూరు నాయకులు

ప్రజాశక్తి-పుట్లూరు

సార్వత్రిక ఎన్నికల వేళ తాడిపత్రిలో చెలరేగిన అల్లర్ల నేపథ్యంలో పుట్లూరు, యల్లనూరు మండలాల్లోని వైసిపి, టిడిపి నాయకులు అజ్ఞాతంలోకి వెళ్లారు. తాడిపత్రిలో అల్లర్లు జరిగాయంటే ఎక్కువగా పుట్లూరు, యల్లనూరు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తల ప్రభావమే ఎక్కువ్వగా ఉంటుంది. ఇందుకు సంబంధించి గతంలో కూడా అనేకమార్లు గొడవలు జరిగి కేసులు నమోదవడంతోపాటు జైళ్లకు కూడా వెళ్లారు. ఈనేపథ్యంలోనే ఈనెల 13, 14వ తేదీల్లో తాడిపత్రిలో పెద్దారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి వర్గాల మధ్య రణరంగం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఇప్పటికే 91 మందిని అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో ఈ రెండు మండలాలకు చెందిన వారు కూడా ఉన్నారు. దీంతో మరి కొందరిని అరెస్టు చేస్తారన్న ఊహాగానాలు రావడంతో పుట్లూరు, యల్లనూరు మండలాల్లోని అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు తమ ఊళ్లను వదిలి అజ్ఞాతంలోకి వెళ్లారు. వీరిలో కొంతమంది శ్రీశైలం, తిరుపతి, తదితర దేవస్థానాలకు వెళ్లగా మరి కొందరు బెంగుళూరు, హైదరాబాద్, గోవా, నగరాలకు వెళ్లినట్లు సమాచారం.

స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

జిల్లా ఎన్నికల అధికారి వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నగరంలోని జెఎన్‌టియులో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల వద్ద అత్యంత పటిష్టమైన భద్రత నిత్యం కొనసాగాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జెఎన్‌టియులో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను ఎస్పీ గౌతమిశాలితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్ట్రాంగ్‌రూములు, కౌంటింగ్ కేంద్రాల వద్ద నిరంతరం నిఘా ఉంచాలన్నారు. 24/7 భద్రత ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు కౌంటింగ్ కేంద్రాల్లో కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. రిటర్నింగ్ అధికారులు రోజూ ఉదయం, సాయంత్రం స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలను విజిట్ చేయలన్నారు. ఏవైనా సమస్యలు ఉన్న తమకు తెలియజేయాలని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీ గౌతమిశాలి మాట్లాడుతూ స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన మూడంచల భద్రతను మరింత పటిష్టం చేసినట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూములు ఏర్పాటు చేసిన చోట ఒక ఎంట్రీ, ఒక ఎగ్జిట్ మాత్రమే ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం భద్రత పకడ్బందీగా ఉండాలన్నారు. జెఎన్‌టియులోని అడ్మిన్ భవనంలో వృథాగా ఉన్న రాళ్లను, చెక్కలను తొలగించాలన్నారు. కాంపౌండ్ వాల్ కు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఎలక్షన్ ఏజెంట్ రూమ్‌ని తనిఖీ చేశారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం జెఎన్‌టియు ప్రధాన భవనంలోని కాన్ఫరెన్స్ హాల్లో నోడల్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అబ్జర్వర్ల కోసం ప్రత్యేకంగా గదులను ఏర్పాటు చేయాలన్నారు. వర్షం వచ్చినా నీరు నిల్వ ఉండకుండా టార్పాలిన్లతో కప్పి వేయాలన్నారు. జెఎన్‌టియులో జంగిల్ క్లియరెన్స్ చేయించాలన్నారు. కౌంటింగ్ రోజు నిరంతర విద్యుత్ సరఫరా జరగాలని, ఇందుకోసం పక్కాగా ఏర్పాట్లు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలను తనిఖీ చేసేందుకు వచ్చే వారికోసం విజిటర్స్ బుక్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా కౌంటింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డి, ఏఆర్ ఎస్పీ లక్ష్మీనారాయణరెడ్డి, రిటర్నింగ్ అధికారులు జి.వెంకటేష్, వెన్నలశ్రీను, కరుణకుమారి, రాంభూపాల్‌రెడ్డి, పార్లమెంటరీ నియోజకవర్గ ఏఆర్ఓ రమేష్‌రెడ్డి, నోడల్ అధికారులు ఓబుల్‌రెడ్డి, సురేంద్ర, భాస్కర్, గురుస్వామి శెట్టి, అప్పాజీ, మధుసూదన్, ఎహసాన్ బాషా, రూప్లానాయక్, ఏఆర్ఓ శిరీషా, ఎన్ఐసి డిఐఓ రవికుమార్, డి.ఎస్.పి మునిరాజా, తదితరులు పాల్గొన్నారు.



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ గౌతమిశాలి

అప్పులబాధతో చేనేతకార్మికుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - పెద్దవడుగూరు

అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలకేంద్రానికి చెందిన చేనేత కార్మికుడు అప్పుల బాధతో సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు.. మండలకేంద్రంలోని చేనేత కాలనీకి చెందిన కుళ్లాయప్ప (40) కుటుంబం ఇంటివద్దనే చేనేతమగ్గం నేస్తూ జీవనం సాగిస్తోంది. చేసిన అప్పులు తీర్చలేక, కుటుంబపోషణ భారమై మనోవేదనకు గురైన కుళ్లాయప్ప ఇంటిలో ఎవరులేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కుళ్లాయప్ప మృతిచెందాడు. కుళ్లాయప్పకు సుమారు రూ.4లక్షల మేరకు అప్పులు ఉన్నాయని మృతుని కుటుంబసభ్యులు తెలిపారు. మృతునిని భార్య విజయలక్ష్మి, ఒక కుమారుడు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివరాలు మెయిన్‌లో...

ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

ఇసుక రీచ్‌లపై ప్రత్యేక దృష్టిసారించాలని ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్. అధికారులు, పోలీసులను ఆదేశించారు. పెద్దపప్పూరు మండల కేంద్రంలోని పెన్నా నదిలో ఉన్న సర్వే నంబర్ 1లో ఇసుక రీచ్‌ను జిల్లా కలెక్టర్ సోమవారం తనిఖీ చేశారు. మైన్స్, గ్రౌండ్ వాటర్ అధికారులు, తహశీల్దార్, పోలీసులు, జిల్లా శాండ్ కమిటీ మెంబర్లతో కలిసి ఇసుక రీచ్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక రీచ్‌లలో ఎలాంటి అక్రమ తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులు రాత్రికి కూడా ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని, చెక్‌పోస్ట్ పాయింట్లను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించాలని అన్నారు. సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రీచ్‌లో ఇసుక నాణ్యత ఎలా ఉంది, ఇక్కడ ఎంత క్వాంటిటీ ఉంది, ఇక్కడ ఎవరైనా అక్రమ తవ్వకాలు చేస్తున్నారా అంటూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ పెద్దపప్పూరు మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తే జరిమానా విధించడం, ఎఫ్ఐఆర్ నమోదు చేయడం, వాహనాలను సీజ్ చేయడం లాంటి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటిదాకా ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి, ఎలాంటి చర్యలు తీసుకున్నారు తదితర వివరాలపై రిపోర్ట్ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మైన్స్ డిడి నాగయ్య, సెబ్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్, గ్రౌండ్ వాటర్ డిడి తిప్పేస్వామి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కిషోర్ రెడ్డి, మైన్స్ ఎజి ఆదినారాయణ, తహశీల్దార్ రాజశేఖర్, ఎఎస్ఐ మహాదేవ్, ఆర్ఐ రామాంజులురెడ్డి, జిల్లా శాండ్ కమిటీ మెంబర్లు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ఇసుక రీచ్‌కు సంబంధించిన మ్యాపును పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

'పంపిణీ' లెక్కల్లో మాయాజాలం

ప్రధాన పార్టీలను ముంచిన నాయకులు
ఆందోళనలో ఇరుపార్టీల అభ్యర్థులు



ప్రజాశక్తి-హిందూపురం

ఈసారి ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలు రెండింటికీ ఆయా పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు నిండా ముంచారన్న ఆందోళనలు నియోజక వర్గ వ్యాప్తంగా ఆయా పార్టీల నాయకుల్లో నెలకొన్నాయి. గతంలో ఏ ఎన్నికల్లోను లేని విధంగా ఈ సారి జరిగిన ఎన్నికల్లో రెండు పార్టీల్లోను నోట్ల కట్టల వరద పారింది. వైసిపి నాయకులు ఓటు రూ. 2వేల చొప్పున నియోజక వర్గంలో దాదాపు రూ.50 కోట్లు పంపిణీ చేయాలని ఆసమయంలో భావించినట్లు తెలిసింది. ఆ మేరకు వివిధ ప్రాంతాల నుంచి డబ్బులు సైతం దిగుమతి చేసుకున్నారు. అదే విధంగానే టిడిపి వారు సైతం పంపిణీ చేశారు. రెండు పార్టీల వారు ఆయా పంచాయతీ, వార్డు సర్పంచ్, కౌన్సిలర్లు, ఇన్‌చార్జ్ ల ఆధ్వర్యంలో పంపిణీ చేయించారు. అయితే ఈ పంపిణీ పూర్తి స్థాయిలో చేయకుండా సగానికి పైగా ఆయా పంచాయతీ, వార్డు ప్రజా ప్రతినిధులు, నాయకులు మింగేశారన్న విమర్శలు ఆయా పార్టీల నాయకుల్లో బలంగా వినపిస్తున్నాయి. దీంతో పాటు ఒక పార్టీలో కీలక నాయకుడిగా కొనసాగుతూ ప్రత్యర్ధి పార్టీకి సహకరించడం, కీలక సమాచారాన్ని చేరవేయడం వంటి అంశాలు ఈ ఎన్నికల్లో కీలకపాత్ర పోషించాయని తెలుస్తోంది. నియోజకవర్గంలో టిడిపి, వైసిపి అభ్యర్థులిద్దరూ ఇంటి దొంగల ముప్పు బారిన పడ్డారనే ప్రచారం జరుగుతోంది. ఒకప్పుడు రాజకీయాల్లో ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు వారున్న పార్టీ అభ్యర్థి విజయం కోసం చిత్తశుద్ధితో పని చేసేవారు. అయితే గత కొంత కాలంగా ఇంటి దొంగల చేతివాటం ప్రధాన రాజకీయ పార్టీలను వెంటాడుతోంది. ఇంటి దొంగలను ఈశ్వరుడైనా కనిపెట్టలేడన్న చందంగా కొంతమంది నాయకులు కోవర్ట్ ఆపరేషన్లను అమలు చేస్తున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి బాలకృష్ణ, వైసిపి అభ్యర్థి దీపిక ఇంటి దొంగల బెడదను ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ విధంగా టిడిపికి చెందిన కొంతమంది నాయకులు వైసిపితో కుమ్మక్కై సహకరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి వారు పెద్ద ఎత్తున డబ్బులు అందుకున్నారనే ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గ పరిధిలో ఉన్న మున్సిపాలిటీ, మూడు మండలాలకు చెందిన కొంతమంది నాయకులు కోవర్ట్ ఆపరేషన్ చేసినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. అదే విధంగా వైసిపికి చెందిన కొంతమంది నాయకులు కూడా టిడిపికి లోపాయికారీ సహకారం అందించారనే చర్చ నడుస్తోంది. ఒకటి, రెండు మండలాలు, పట్టణానికి చెందిన నాయకులు టిడిపితో లాలూచీ పడినట్లు అధికారపార్టీ శ్రేణుల్లో గుసగుసలు మొదలయ్యాయి. పోలింగ్ ముగియడంతో ఓట్ల లెక్కింపు కోసం ప్రధాన అభ్యర్థులు ఎదురు చూస్తున్నారు. ఎక్కడ ఆధిక్యత వస్తుందనే అంచనాల్లో అభ్యర్థులు మునిగి తేలుతున్నారు. ఒకటికి రెండు సార్లు పార్టీ నాయకులు, కార్యకర్తల పనితీరు, ప్రవర్తనలను అంచనా వేసుకుని ఫలితం ఎలా వుండబోతుందని పోస్ట్ మార్టం జరుపుకుంటున్న కనిపిస్తోంది. ఈ దఫా ఎన్నికల్లో ఒక ప్రధాన పార్టీకి చెందిన కొంతమంది కౌన్సిలర్లు, నాయకులు పట్టణంలో సరిగ్గా ఓటర్లకు డబ్బులు పంపిణీ చేయలేదనిఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు గుసగుసలాడుకుంటున్నారు. దీనిపై ఆ పార్టీ అభ్యర్థి కూడా ఆరా తీస్తున్నట్లు సమాచారం. ప్రత్యర్థి పార్టీ నాయకులు, కార్యకర్తలను ప్రలోభాలకు గురి చేసి లబ్ది పొందాలనే వ్యూహ, ప్రతివ్యూహాలతో టిడిపి, వైసిపి అభ్యర్థులు ఇద్దరూ ఆపరేషన్ ఆకర్ష్ నిర్వహించారనేది స్పష్టంగా కనిపిస్తోంది. అయితే ఈ వ్యవహారంలో ఎవరి ఆపరేషన్ సక్సెస్ అవుతుందో, ఎవరి వ్యూహం ఫలిస్తుందో ఇప్పుడే చెప్పడం కష్టం. కానీ పోటీలో ఉన్న అభ్యర్థులు మాత్రం వారి గత అనుభవాన్ని బట్టి ఆ నష్టం ఏమేరకు వుంటుందనేది అంచనా వేస్తున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రకటించిన మేనిఫెస్టోలు, గతంలో అవి అధికారంలో ఉన్నప్పుడు అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రజల విశ్వసనీయత కొంతవరకు ఓట్లు రాబడితే ఎత్తుకు పైఎత్తులు, వ్యూహ, ప్రతివ్యూహాల వల్ల కొంత మేలు జరుగుతుందని అభ్యర్థులు భావిస్తున్నారు. దీంతో నియోజకవర్గ ఎన్నికల్లో వైసిపి, టిడిపి అభ్యర్థులిద్దరూ కోవర్ట్ ఆపరేషన్లను ప్రోత్సహించారనేది బహిరంగ రహస్యం. అయితే ఆ ఆపరేషన్లు ఎవరి కొంప ముంచుతాయనేది తేలాలంటే జూన్ 4వరకు ఆగాల్సిందే.



డెంగీ వ్యాధి నిర్ధారణ కిట్లను పంపిణీ చేస్తున్న వైద్యాధికారులు

డెంగీ నిర్ధారణ కిట్లు పంపిణీ

వజ్రకరూరు : ఉరవకొండ డివిజన్ పరిధిలోని ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు మండలాల్లోని ఏడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బందికి సోమవారం డెంగీ వ్యాధి నిర్ధారణ కిట్లను సోమవారం పంపిణీ చేశారు. ఉరవకొండ డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి భత్తుల కోదండరాంరెడ్డి ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య సిబ్బందికి దాదాపు 1330 ఎన్ఎస్-వన్ కిట్లను పంపిణీ చేశారు. గ్రామాల్లో వైద్య పరీక్షలు నిర్వహించి డెంగ్యూ వ్యాధి ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ ప్రభుత్వాసుపత్రి మెడికల్ ఆఫీసర్ ఎల్లోజి, ల్యాబ్ టెక్నీషియన్ నాగమల్లి ఆశ, ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రి డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు మిడతల చంద్రమౌళి, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విత్తనకాయల కోసం పేర్లు నమోదు చేసుకోండి

బెలుగుప్ప : ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు చేసే రైతులు మండల కేంద్రంలోని ఆయా ఆర్‌బికెల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పృథ్వీసాగర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి 1800 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలు కేటాయించినట్లు తెలిపారు. 40శాతం సబ్సిడీతో రైతులకు వేరుశనగ అందజేయనున్నట్లు తెలిపారు. కాయలు కావాల్సిన రైతులు పేర్లను నమోదు చేసుకుంటే ఈనెల 24వ తేదీ నుంచి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

పురాతన కట్టడాల ప్రాముఖ్యతను వెలుగులోకి తీసుకురావాలి

కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలోని పురాతన కట్టడాల ప్రాముఖ్యతను వెలుగులోకి తీసుకురావాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. సోమవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో రాష్ట్ర పురావస్తు, ప్రదర్శనల శాలల శాఖ, ఇంటాక్ సంస్థలతో పురాతన కట్టడాల ప్రాముఖ్యతను వెలుగులోనికి తీసుకురావడంతోపాటు కట్టడాల చరిత్రను అక్షరబద్ధం చేసి భావితరాలకు ఏ విధంగా అందించగలం అనే అంశంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగాకలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చారిత్రక ప్రాధాన్యత పొందిన స్థలాలు, భవనాలు, కట్టడాలు మొదలైన వాటిపై ఆర్కియాలజీ, చరిత్రపై మక్కువవున్న ఇంటాక్ సభ్యులు పరిశోధన చేయాలన్నారు. వాటి ప్రాధాన్యతను వెలుగులోకి తీసుకొచ్చి పుస్తక రూపంలో ముద్రించినట్లైతే అందరికీ అందుబాటులోకి వచ్చి చారిత్రక ప్రాధాన్యత పొందిన స్థలాలు, భవనాలు, కట్టడాలు మొదలైన వాటిపై అందరికీ అవగాహన కలుగుతుందన్నారు. అంతేగాకుండా వాటిని కాపాడుకోవడానికి వీలవుతుందన్నారు. జిల్లాకు వచ్చిన వారికి జిల్లా చరిత్ర, ప్రాధాన్యత పొందిన స్థలాలు, భవనాలు, కట్టడాలు మొదలైన వాటి గురించి తెలియజేసేలా చూడాలన్నారు. ఇందుకోసం జిల్లా టూరిజం కౌన్సిల్ ని ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాకు సంబంధించి పూర్తి వివరాలతో ఒక యాప్ ను సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, పురావస్తు, ప్రదర్శనల శాలల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (టెక్నికల్) వి.రజిత, టెక్నికల్ అసిస్టెంట్ మహేంద్రనాయుడు, ఇంటాక్ కోకన్వీనర్ చంద్రహాస్‌రెడ్డి, లైఫ్ మెంబర్ రమేష్‌నారాయణ, ఇతర సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

కాలువలు, వంతెనలను శుభ్రం చేయాలి

సిపిఎం ఆధ్వర్యంలో వినతి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని మురికి కాలువలతోపాటు మరువవంక, నడిమివంకల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించాలని సిపిఎం 1వ నగర కార్యదర్శి రామిరెడ్డి కోరారు. ఈమేరకు సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని కార్యాలయంలో కమిషనర్ మేఘస్వరూప్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల క్రితం అనంతపురంలో ఎప్పుడూ కనీవిని ఎరుగని రీతిలో వరద రావడంతో వందల కుటుంబాలు ఆర్థికంగా నష్టపోయాయన్నారు. ఇందుకు ప్రధానంగా నడిమివంక, మరువవంకల్లో పూడిక తీయకపోవడమేనని అని గుర్తు చేశారు. కనీసం ఈసారి వర్షాకాలం అయినా కాలువల్లో చెత్తా చెదారం, పూడిక తీసివేయాలని కోరారు. ఇందుకు కమిషనర్ స్పందిస్తూ ఎక్కడ సమస్య ఉందో తెలియజేయాలని కోరగా రిషిత పబ్లిక్ స్కూల్ వద్ద బ్రిడ్జి, కృష్ణా టాకీస్ బ్రిడ్జి , కేర్ అండ్ క్యూర్ ఆసుపత్రి వద్ద ఉన్న వంతెనల్లో ఎక్కువగా చెత్త పేరుకుపోయిందని తెలిపారు. వెంటనే కార్మికులతో ఆయా ప్రాంతాల్లో శుభ్రం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ప్రకాష్, మసూద్, జీవ, వెంకటేష్, ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

రబీ సాగు వివరాలను సిద్ధం చేయాలి : ఎడిఎ

ప్రజాశక్తి-వజ్రకరూరు

2023 సంవత్సరానికి సంబంధించి రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలు వివరాల జాబితాను సిద్ధం చేయాలని ఉరవకొండ డివిజన్ ఎడిఎ పద్మజ సూచించారు. సోమవారం విడపనకల్ మండలంలో రైతు భరోసా సిబ్బందికి వేరుశనగ పంపిణీ, 2023 రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల జాబితాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 28 తేదీలోగా ఆయా నివేదికలను తయారు చేసి జిల్లా వ్యవసాయ అధికారికి సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ పెన్నయ్య, ఆర్‌బికె సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎడిఎ పద్మజ

వేరుశనగ కోసం 10,205 మంది రిజిస్ట్రేషన్

అనంతపురం : జిల్లాలోని 29 మండలాల్లో సబ్సిడీ వేరుశెనగ కాయలు కోసం రైతు భరోసా కేంద్రాల్లో 10,205 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు విత్తన కాయలు కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న దాని ప్రకారం 9,077 క్వింటాళ్లు అవసరం అవుతాయన్నారు.

ఇసుక రీచ్ పరిశీలన

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని వేపరాల సమీపంలో ఉన్న ఇసుక రీచ్‌ను కళ్యాణదుర్గం ఆర్డీవో రాణీసుస్మిత సోమవారం పరిశీలించారు. కొంతకాలంగా రీచ్‌లో ఇసుక తవ్వకాలు నిలిపివేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో సంబంధిత ఇసుక రీచ్‌ను ఆర్‌డిఒ తనిఖీ చేసి ఇసుక నిల్వ, విస్తీర్ణానికి సంబంధించి మైనింగ్ శాఖ అధికారులు కొలతలు తీసుకున్నారు. నివేదికలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సెబ్ అధికారులు, రాయదుర్గం తహశీల్దార్ చిట్టిబాబు, ఎంపిడిఒ అల్లాబకాష్, అర్బన్ సిఐ శ్రీనివాసులు, ఇఒఆర్‌డి రంగనాయకులు, తదితరులు పాల్గొన్నారు.



వేపరాల రీచ్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ రాణీసుస్మిత



బ్రహ్మోత్సవాల సందర్భంగా పెన్నోబిలం ఆలయానికి చేరుకున్న నారసింహుడు

పెన్నహోబిలం చేరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు

వజ్రకరూరు : ఉరవకొండ మండలం పెన్నోబిలంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఉత్సవ విగ్రహాలు సోమవారం సాయంత్రం పెన్నోబిలం చేరాయి. శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం సందర్భంగా సంప్రదాయ ప్రకారం ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామం నుంచి ఉత్సవ విగ్రహాలను తీసుకొచ్చారు. ఇందులో భాగంగా గ్రామంలో పెన్నోబిలేసుని ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం మేళతాళాల మధ్య శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ విగ్రహాలను తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ విజయ్ కుమార్, అర్చకులు ద్వారకానాథ్, బాలాజీ స్వామి తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వస్తివాచకం,రక్షాబంధనం, మత్స గ్రహణం, కలశ స్థాపన, మహా మంగళహారతి తదితర పూజలు నిర్వహించారు.

అక్రమ అడ్మిషన్లను నివారించాలి



తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఆర్ఎస్‌యు నాయకులు

వజ్రకరూరు : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ అడ్మిషన్లు చేపడుతున్న ఉరవకొండలోని ఎవిఆర్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్‌యు జిల్లా అధ్యక్షులు భీమేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక కార్యాలయంలో తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవిఆర్ పాఠశాల బిల్డింగ్‌పై 10 కి 10 పాయింట్లు వచ్చాయని అడ్మిషన్లు చేస్తూ గ్రామీణ ప్రాంత ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కుతూ అకాడమిక్ ఇయర్ ప్రారంభం కాకముందే ఇష్టానుసారంగా ప్రచారాలు చేస్తూ బహిరంగంగా అక్రమ అడ్మిషన్లకు పాల్పడుతున్నా విద్యాధికారులు పట్టించుకోలేదన్నారు. వెంటనే సంబంధిత పాఠశాలపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యు విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేడు నరసింహ జయంతి

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని మల్లాపురం సమీపంలో వెలసిన శ్రీ విప్రమలై లక్ష్మీ నవనారసింహస్వామి ఆలయంలో మంగళవారం నరసింహ జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు రామ్మూర్తి స్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అన్నదానం

పుట్లూరు : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సోమవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దాతలు ఆర్.ఓబులేసు, కె.రామాంజనేయరెడ్డి, బి.రామాంజనేయరెడ్డి, కె.రామచంద్రారెడ్డి, పూజారి నాగాప్ప, కుందు శ్రీనివాసులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న దృశ్యం

విత్తన నాణ్యతలో రాజీపడొద్దు

జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-అనంతపురం

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పంపిణీ చేయనున్న విత్తన వేరుశనగ కాయల నాణ్యతలో రాజీ పడొద్దని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి యు.ఉమామహేశ్వరమ్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక గుత్తి రోడ్డులో ఉన్న హిమబిందు, కృష్ణ ట్రేడర్స్, విజయ ఆగ్రో ఏజెన్సీస్, నందీశ్వర ఏజెన్సీస్ సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లను అనంతపురం ఎడిఎ ఎం.రవితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేరుశనగ విత్తన ప్రాసెసింగ్ యూనిట్లలో తప్పనిసరిగా లాట్స్ వారీగా నమూనాలు సేకరించి విత్తన మొలక శాతం గుర్తించాలని అధికారులను ఆదేశించారు. వేరుశనగ కాయల ప్యాకింగ్ సమయంలోనే పుల్లలు, బొటిక కాయలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రాసెసింగ్ నిర్వాహకులు వ్యాపార దృక్పథంతో కాకుండా రైతులకు నాణ్యమైన వేరుశెనగ విత్తన కాయలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం వేరుశనగ మొలక శాతం ట్రేలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో అనంతపురం మండల వ్యవసాయ అధికారి జె.శశికళ, జెడిఎ కార్యాలయం సాంకేతిక వ్యవసాయ అధికారి రాకేష్, ఎఇఒ మురళీకృష్ణ, ఎంపిఇఒలు, తదితరులు పాల్గొన్నారు.



విత్తనాల మొలకను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ

IN THE COURT OF THE HON'BLE IIV ADDITIONL DISTRICT JUDGE:: ANANTAPURAMU

I.A . NO: 82/2024 In OS.NO:30/2024

Between:

K.Gundaiah ...Petitioner/plaintiff

And

1.Patakamuri Subhashini and 2 others ...Respondents/Defendents

NOTICE TO RESPONDENTS/ DEFENDENTS NO. 1,2,3

Respondent/Defendent No.1

Patakamuri Subhashini D/o Medalamuri Subbaryudu (w/o Modi palli Kesavaiah Door No11-2-65, Nayak Nagar, Ananthapuramu city & Dist.

Respondent/Defendent No.2

Modi palli Kesavaiah S/o Modi palli Raja Gopal Door no 18-1-455, Venu Gopal Nagar, Ananthapuramu city & Dist

Respondent/Defendent No.3

K.Venkataraman S/o Gundaiah Door No 1-4-100-1, Janashakthi Narar H L C Colany, Ananthapuramu city & Dist.

ఇందుమూలంగా తెలియజేయడం ఏమనగా ప్రతివాదులైన (R1/D1, R2/D2, R3/D2,) మీ హాజరు నిమిత్తం పై కోర్టు నందు 24/06/2024 వ తేదిన వాయిదా ఉన్నది. కావున పై తేది రోజు ఉదయం 10:30 గంటలకు స్వతహాగా గానీ వకీలు ద్వారా గానీ హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల కోర్టు నందు దాఖలు చేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించెదరు.

(By order of the court)

జగన్ అయ్యంగార్,
అడ్వకేట్, అనంతపురం

IN THE COURT OF THE HON'BLE IIV ADDITIONL DISTRICT JUDGE:: ANANTAPURAMU

OS.NO:30/2024

Between:

K.Gundaiah ...plaintiff

And

1.Patakamuri Subhashini and 2 others ...Defendents

NOTICE TO DEFENDENTS NO. 1&2

Defendent No.1

Patakamuri Subhashini D/o Medalamuri Subbaryudu w/o Modi palli Kesavaiah Door No11-2-65, Nayak Nagar, Ananthapuramu city & Dist.

Defendent No.2

Modi palli Kesavaiah S/o Modi palli Raja Gopal Door no 18-1-455, Venu Gopal Nagar, Ananthapuramu city & Dist

ఇందుమూలంగా తెలియజేయడం ఏమనగా ప్రతివాదులైన (D1, D2,) మీ హాజరు నిమిత్తం పై కోర్టు నందు 24/06/2024 వ తేదిన వాయిదా ఉన్నది. కావున పై తేది రోజు ఉదయం 10:30 గంటలకు స్వతహాగా గానీ వకీలు ద్వారా గానీ హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల కోర్టు నందు దాఖలు చేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించెదరు.

(By order of the court)

జగన్ అయ్యంగార్,
అడ్వకేట్, అనంతపురం

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు : ఎంఇఒ



గుత్తి : మండల వ్యాప్తంగా ఉన్న ప్రయివేటు పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా అధికంగా ఫీజులు వసూలు చేస్తే చర్యలు చేపడతామని మండల విద్యాధికారి బి.రవినాయక్ హెచ్చరించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజులు తీసుకోవాలన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించిన పాఠశాలలపై చర్యలు తప్పవన్నారు.

IN THE COURT OF THE ADDL. SENIOR CIVIL JUDGE, ANANTHAPURAMU

I.P. No. 24/2019

Between:-

C.Ramanjaneyulu ...Petitioner

AND

Pagadala Venkateswara Prasad and 22 others ...Respondents

NOTICE TO R4, R11, to R15

To:

R4: Gopal S/o Not Know, Business, Hindu, aged about 42 years, D.No:19-3-293, Bhavani Nagar, Near Cheruvukatta, Ananthapuramu Town,

R11: Viswanath S/o Not Know, Hindu, aged about 45 years, D.No:9-743, 4th Road, Ananthapuramu Town,

R12: Ranganath S/o Not Know, Hindu, aged about 50 years, Business, D.No:4-39, Behind R.T.C Bus Stand, Bukkarayasamudram (V & M) Ananthapuramu District,

R13: Raja Gopal S/o Not Know, Hindu, aged about 48 years, D.No:19-1-104, Bhavani Nagar, Ananthapuramu Town,

R14:G.Amarnath S/o Not Know, Hindu, aged about 40 years, Business, R/o D.No:12-2-214-C, Sai Nagar, Ananthapuramu Town,

R15: Chiranjeevi S/o Not Know, Hindu, aged about 50 years, Business, R/o D.No:28-5-167, Housing Board Colony, Ananthapuramu Town,

పై నెంబరు కేసులో, పిటీషనర్‌ను ఇన్‌సాల్‌వెన్సీగా తీర్మానించమని పిటీషన్ దాఖలు చేసియున్నారు.కావున 4వ ప్రతివాది మరియు 11,12,13,14,15వ ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తం 19/06/2024వ తేది ఉదయం 10:30 గంటలకు వాయిదా వేసినారు. కావున ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

K.SIDDAIAH,
B.MALLIKARJUNA REDDY,
Advocates, Anantapuramu.
Cell No: 9908656095

రైతులందరికీ సబ్సిడీ విత్తనకాయలు పంపిణీ

ప్రజాశక్తి-వజ్రకరూరు

దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ సబ్సిడీ వేరుశన విత్తనకాయలు పంపిణీ చేస్తామనిఉరవకొండ మండల వ్యవసాయ అధికారి శుభకర్ తెలిపారు. సోమవారం ఉరవకొండ మండలంలోని ఆమిద్యాల, రాకెట్ల రైతు భరోసా కేంద్రాలను తనిఖీ చేయడంతోపాటు వేరుశనగ విత్తన నమోదు ప్రక్రియను పరిశీలించారు. ముందుగా ఆమిద్యాలలో దిగుమతి చేసుకున్న వేరుశనగ బస్తాలను రైతుల సమక్షంలో పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4శాతం కన్నా బస్తాలో ఎలాంటి ఇతర వ్యర్థ పదార్థాలు (పుల్లలు, రాళ్లు, మట్టి పెల్లలు) ఉండకూడదన్నారు. అదేవిధంగా 74 శాతం అవుటన్ ఉండాలన్నారు. అలాంటి కాయలను మాత్రమే రైతు భరోసా సిబ్బంది రైతుల సమక్షంలో దిగుమతి చేసుకోవాలని సూచించారు. కాగా మండలంలోని ప్రతి గ్రామానికీ సరిపడినంత వేరుశనగ కాయలను ఇచ్చామన్నారు. ఈ అవకాశాన్నిరైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

అదేవిధంగా ఆమిద్యాలలోని స్థానిక జనతా అగ్రి సొల్యూషన్ ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేని పురుగు మందులను అమ్మకూడదన్నారు. ఆధీకత డీలర్ ద్వారా తెచ్చిన సరుకులు మాత్రమే రైతులకు బిల్లుతో సహా ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమిద్యాల, రాకెట్ల రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ఫర్టిలైజర్స్ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎఒ శుభకర్

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని ఉద్దిబావి చేను కాలనీలో నీటి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరారు. ఈమేరకు కాలనీవాసులు ఎంపిడిఒ రాముడు, ఇఒఆర్‌డి శైలజారాణిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ కొద్ది రోజుల నుంచి కుళాయిలకు నీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. ముఖ్యంగా పోస్టాఫీస్ సందులో చుక్క నీరు రావడం లేదన్నారు. దీంతో దైనందిన కార్యక్రమాలు చేసుకోవడం కూడా ఇబ్బందికరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇందుకు ఎంపిడిఒ స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైనంత తర్వగా సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు రామకృష్ణ, రాధాకృష్ణ, శ్రీనివాసులు, గౌస్, తిమ్మయ్య, పుల్లగూర శెట్టి, లోకేష్‌తోపాటు మహిళలు పాల్గొన్నారు.



ఎంపిడిఒ రాముడుకు వినతిపత్రం సమర్పిస్తున్న ఉద్దిబావిచేను కాలనీవాసులు

రక్తదాన శిబిరాలు

ప్రజాశక్తి-పామిడి

జూనియర్ ఎన్టీఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుమారు 70 మంది స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేసినట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఈ సందర్భంగా సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శివకార్తీక్‌రెడ్డి, కమలాకర్ రావు, కిరణ్మయి మాట్లాడుతూ రక్తదాతలు ప్రాణదాతలు అన్నారు. ప్రతి నీటి చుక్కా ఎంత అవసరమో.. ప్రతి రక్తపు బొట్టూ అంతే అవసరమన్నారు. టీమ్ తారక్ ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న ముగ్గురికి ప్రాణదానం చేసిన వాళం అవుతామన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి నిరభ్యంతరంగా రక్తదానం చేయవచ్చన్నారు. కావున ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, అభిమానులు, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, సామాజిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



పామిడిలో రక్తదానం చేసిన దాతలు

గుత్తి : పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయ పాత భవనంలో జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 46 మంది జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు, యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు రాజు, సాదిక్, టిడిపి నాయకులు బోర్ వెల్ నాగరాజు, కరిడికొండ సుధాకర్, ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకుడు అంజన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం

అనంతపురం : జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం 6వరోజు సోమవారం కూడా కొనసాగింది. ఇందులో భాగంగా సంస్థ కార్యదర్శి శ్రీమతి రమ ఆధ్వర్యంలో యోగా వెంకటేశప్ప, డ్రాయింగ్ హర్ష, అనిల్, స్టోరీ టెల్లింగ్ మహేష్, మధు, నేర్పించారు. అలాగే సూర్యనారాయణ తెలుగు పద్యాలు చదివి వాటి అర్థాలను వివరించారు. రమేష్ డ్యాన్స్ అకాడమీ వారు డ్యాన్స్ నేర్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఇంతియాజ్, అహ్మద్, కావేరి, ఉజ్జినేశ్వరి, ముత్యాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

నేరాలు ఘోరాలు

రైలు కింద పడి వ్యక్తి మృతి

తాడిపత్రి రూరల్ : రైలు కింద పడి వ్యక్తి మృతిచెందిన ఘటన రూరల్ పరిధిలోని పుట్లూరు రోడ్డు రైల్వేస్టేషన్‌లో సోమవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన రంగయ్య (30) కూలి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇందులో భాగంగానే ఉదయం పుట్లూరు రోడ్డు రైల్వేస్టేషన్‌లో రెండో ఫ్లాట్‌ఫారం నుంచి ఒకటో ఫ్లాట్ ఫారం వరకు వచ్చే సమయంలో సడెన్‌గా గూడ్స్ రైలు వచ్చి ఢీకొంది. వెంటనే ప్రయాణికులు కాపాడి అంబులెన్స్ ద్వారా తాడిపత్రి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడికి భార్య నాగమణి, కుమారుడు దేవాన్ష్ ఉన్నారు.

పేకాట జూదరుల అరెస్టు

కళ్యాణదుర్గం : మండల పరిధిలోని మద్రిమాకులపల్లి గ్రామ శివార్లలో పేకాట స్థావరంపై దాడి చేసి 12మందిని అరెస్టు చేసినట్లు కంబదూరు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మద్రిమాకులపల్లి శివార్లలో పేకాట ఆడుతున్నట్లు పక్కాగా అందిన సమాచారంతో దాడి చేసి 12 మందిని అరెస్టు చేసి, రూ.55,000 నగదు, 7 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులకు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న కంబదూరు ఎస్ఐ ఆంజనేయులు

బత్తలపల్లిలో.....

బత్తలపల్లి : మండలంలోని వెంకటగారిపల్లి సమీపంలో ని ఓ వ్యవసాయ తోట వద్ద పేకాట స్థావరంపై దాడులు చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి రూ. 20,150 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పి.శ్రీని వాసులు తెలిపారు. ఎస్ఐ సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ వెంకటగారిపల్లి సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి దాడులు చేశామని తెలిపారు. నలుగురు పేకాట జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ. 20.150తో పాటు 3 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని, వీరిని ధర్మవరం కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.